మా బతుకులకు భరోసా ఏదీ?

- ఎండీయూ వ్యవస్థకు మంగళం
- రోడ్డునపడిన రేషన్ వాహనాల ఆపరేటర్లు
- లబోదిబోమంటున్న పలు కుటుంబాలు

ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల వివరాలు ఇలా..

మండలం	రేషన్ దుకాణాలు	కార్డులు	ఎండీయూ వాహనాలు
రణస్థలం	73	27,879	18
లావేరు	58	21,457	14
ఎచ్చెర్ల	60	27,463	17
జి.సిగడాం	50	17,587	11



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు ఇస్తున్న దృశ్యం (ఫైల్)



సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రణస్థలం: కూటమి ప్రభుత్వం సంక్షేమాన్నే కాదు.. ప్రజలకు అందజేయాల్సిన సేవలకు కూడా ఒక్కొక్కొటిగా మంగళం పాడుతోంది. దేశం మెచ్చిన ఎన్నో పథకాలను, సరికొత్త సంస్కరణలను తీసుకువచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేరు వినిపించకుండా ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేస్తోంది. ప్రజలు మెచ్చే విధంగా రేషన్ పథకాన్ని సరికొత్తగా వాలంటీర్ల రూపంలో ఇంటింటికీ చేరవేయడం, వీధుల వరకు ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు అందజేయడం వలన ప్రజలకు ఎటువంటి భారం లేకుండా ఉండేది. వాలంటీర్ వ్యవస్థను తీసేయడం, ఇప్పుడు రేషన్ వాహనాలను కూడా రద్దు చేయడంతో వాహన ఆపరేటర్లు (డ్రైవర్లు) ఉపాధి కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో వేల కుటుంబాలు వీధినపడ్డాయి. ప్రజలకు మళ్లీ పాత కష్టాలు మొదలు కానున్నాయి.

గడువుకు ముందే వెళగొట్టిన వైనం

ఎండీయూ వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే 72 నెలలకు అగ్రిమెంట్ చేయడంతో 2027 జనవరి వరకు సమయం ఉంది. మరో 20 నెలల వరకు కొనసాగే హక్కు ఉన్నా.. అర్ధాంతరంగా ఏండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఉన్న ఫలంగా వాహనాలు అపేయడంతో ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రస్తుతం వారంతా ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

ఎండీయూ వాహనాల రద్దుతో ఎచ్చెర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 60 మంది ఆపరేటర్లు, సహాయకులతో కలిపి సుమారు 120 కుటుంబాలు రోడ్డునపడ్డాయి. వాళ్లకి జీవనాధారం చూపించాలి. రెండు సంవత్సరాల నాలుగు నెలలకు సంబంధించి అంగన్‌వాడీ మిడ్డే మిల్స్ బకాయిలు చెల్లించాలి. గత నెలలో ఇన్సూరెన్స్ రూపంలో కట్ చేసిన రూ.9 వేలు చెల్లించాలి. 2027 వరకు అగ్రిమెంట్ ఉన్నందున బ్యాంక్ లావాదేవీలపై ఎన్‌ఓసీ ఇప్పించాలి. అకారణంగా తొలగిస్తున్నందున మరో రూపంలో ఉపాధి కల్పించాలి. విజయవాడ వరద బాధితుల సహాయం కోసం వెళ్లిన వాహనాలకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి.

మా బతుకులు రోడ్డునపడ్డాయి



అగ్రిమెంట్ గడువుకు ఇంకా 20 నెలల సమయం ఉంది. ఇలోగా మా బతుకులు రోడ్డు పాలు చేసి మా కుటుంబాల భవిష్యత్‌ను నాశనం చేయడం ఈ ప్రభుత్వానికి తగదు. తమ సమస్యలు పరిష్కరించాలి. తమకు ఉపాధి మార్గం చూపాలి.

– లెంక అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి, ఏండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్

ఉపాధి కల్పించాలి



ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయంతో మా బతులు రోడ్డునపడ్డాయి. ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఇంటి ముందకే రేషన్ వాహనం తీసుకెళ్లి వృద్ధులు, దివ్యాంగులకే కాకుండా ఉదయాన్నే అందరికీ సరుకులు సకాలంలో అందించాం. అలాంటి మా బతుకులు ఇలా అవుతాయని ఎప్పుడూ ఊహించలేదు.

– మైలపల్లి జగ్గులు, ఎండీయూ ఆపరేటర్, కొవ్వాడ, రణస్థలం మండలం

క్లుప్తంగా

ఘనంగా నీలమ్మ సంబరాలు



ముర్రాటలు తీసుకెళ్తున్న భక్తులు

జి.సిగడాం: నీలమ్మా మా గ్రామంలో ఉన్న అందరినీ సుఖసంతోషాలతో ఉండేలా చూడు తల్లీ అంటూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో గురువారం నీలమ్మ తల్లి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీలమ్మకు ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 27వ తేదీన గ్రామ దేవత పండగలను నిర్వహించున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

జి.సిగడాం: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రామకృష్ణ యోగా చైతన్య ధార్మిక సంస్థ గురువు మీసాల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లడుతూ.. ప్రతిఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతీరోజు ఉదయం గంట సమయం యోగా చేయాలన్నారు. సంతవురిటి ఆయుష్ హోమియో వైద్యుడు కృష్ణచంద్, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, డీటీలు ఎస్.నిర్మల, కె.గాయిత్రి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షాదక్షుడు ఆంజనేయుడు



హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: దీక్షాదక్షుడు అంజనేయుడని, ఎంతటి ఘనకార్యాలైనా సాధించగల సామర్థ్యం కలవాడని వక్త పైడి హరనాథరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ వైభవంపై గురువారం ఉపన్యసించారు. కలియుగ బాధలు, ఏలినాటి శని బాధలు, సకల గ్రహ పీడలు తొలగించు మేటి దైవం ఆంజనేయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోమలరావు, సూరిబాబు, పట్నాయక్, రమణ, నరసింహమూర్తి, ఈశ్వరరావు, ప్రభాకర్‌రావు, బలరాం, పతంజలి శాస్త్రి, అరుణకుమారి, లక్ష్మీ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం అన్యాయం



వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

జి.సిగడాం: రేషన్ సరుకులను సకాలంలో అందించే ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం అన్యాయమని మండలం ఎండీయూ వాహనాల సంఘం అధ్యక్షుడు పేడాడ రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మలకు వినతిపత్రం అందించారు. తిరుమరెడ్డి లక్ష్మణరావు, కెంబూరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రహదారులు పూర్తయ్యేది ఎప్పుడు?



మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

జి.సిగడాం: పల్లె పండగ పేరుతో గ్రామాల్లోని రహదారులను తవ్వి బీటీ రోడ్లు వేస్తామని చెప్పి ఇంతవరకు ఎందుకు వేయలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని దవళపేట గ్రామంలో ఆయన మాట్లాడారు. సంతవురిటి నుంచి విజయరాంపురం, సీతారాంపురం నుంచి సంతవురిటి కోనేరు, రాజాం-చిలకపాలెం రోడ్డు నుంచి సంతవురిటి గ్రామానికి బీటీ రహదారుల నిర్మాణం కోసం పనులు ప్రారంభించారన్నారు. మూడు నెలల ముందు మెటల్ వేసి అర్ధాంతంగా పనులు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం పంచాయతీ పరిధి నవభారత్ సమీపంలో జాతీయ రహదారిపై పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు వాహనాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. 13 దూడలు, 8 గేదెలతో వాహనాలు విశాఖ వైపు తరలిస్తున్నారు. తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. పశువులను విజయనగరం జిల్లాలోని కొత్తవలస గోశాలకు తరలించారు.

ఘనంగా సన్నాల పోలమ్మ దేవర ఉత్సవం



పాత శ్రీకాకుళంలో గ్రామదేవత ఉత్సవంలో భాగంగా బాదుర్లుపేటలోని సన్నాల పోలమ్మ అమ్మవారికి గురువారం దేవర ఉత్సవం ఘనంగా జరిగింది. భక్తులు, సిరిమాను కమిటీ సభ్యులు డప్పులతో వెళ్లి అమ్మవారికి ఉపవాసం చెప్పడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–శ్రీకాకుళం కల్చరల్

కార్యదర్శులను కించపరచడం తగదు



జిల్లాలో గురువారం జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ కార్యదర్శులందరి మనోభావాలను కించపరిచేలా అసమర్థులు అన్నట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయ కో–ఆర్డినేటర్ ఉదయ్ మాట్లాడటం తగదని జిల్లా పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజాను కలిసి ఉదయ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని, ఉదయ్ తన వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

–అరసవల్లి

తెలుగు పఠనం తప్పనిసరి



విద్యార్థులకు చిన్నప్పటి నుంచే నీతి కథలు, తెలుగు పద్యాలు చదవడం అలవాటు కావాలని వరం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉప్పు త్రినాథరావు అన్నారు. బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం పిల్లలకు వేమన శతకం, సుమతీ శతకం పద్యాలు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను, సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి: శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల పనితీరును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రెవెన్యూ విభాగంలో డిమాండ్-కలెక్షన్-బ్యాలెన్స్ ప్రకారం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. యూపీఐ కోడ్‌ల ద్వారా వసూళ్లను పెంచాలని, మున్సిపల్ ఆస్తులైన షాపులు, అద్దెల వసూలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో శానిటేషన్ కార్మికుల హాజరు నియమితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రైయిన్ల డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. కమ్యూనిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తిగా ఆపరేషన్‌లోకి తేవాలని, మున్సిపల్ వాహనాల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాంట్ల ప్రగతిపై సమీక్షించారు. జిందాల్ ప్లాంట్‌కు వ్యర్థాల రవాణాపై స్పష్టత కోరారు. టాయిలెట్ల నిర్వహణ, కొత్తగా నిర్మించే టాయిలెట్లపై కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో మంజూరైన గ్రాంట్లు, జనరల్ ఫండ్ పనుల పురోగతిపై సమీక్షించి, పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణాలు, కూల్చివేతల వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలని, ప్లానింగ్ సెక్రటరీల జాబ్ చార్ట్‌ను పాటించేలా చూడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, వార్డు సచివాలయాల అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు స్కానింగ్‌కు రిఫర్ చేయరాదు

అరసవల్లి: జిల్లాలోని ఆర్‌ఎంపీలు గర్భిణులను అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లకు రిఫర్ చేయరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం పొందడం వల్ల మాతా శిశుమరణాలు జరగకుండా నియంత్రించవచ్చన్నారు. పిల్లల పెరుగుదల, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యాలు నిర్ధారించుటకు ప్రతి గర్భిణీ వైద్యులను సంప్రదించాలన్నారు. ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్‌ఎంపీలు గర్భిణులకు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

పక్షుల దాహార్తిని తీర్చాలి

శ్రీకాకుళం అర్బన్: వేసవి నేపథ్యంలో జంతువులు, పక్షుల దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. పశుపక్ష్యాదులకు చల్లని నీటి చుక్కలు అందించేందుకు తయారు చేసిన సిమెంట్ బౌల్స్‌ని జీఎస్‌వీ జ్యువెలర్స్ సహకారంతో గురువారం నగరంలో పంపిణీ చేశారు. సిక్కోలు సోషల్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాచకుడు మృతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని పెదపాడులో అప్పన్నమ్మ ఆలయం పరిసర ప్రాంతంలో గురువారం కప్ప రాజారావు (59) అనే యాచకుడు మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతో పాటు సరైన తిండి లేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇతని స్వస్థలం నరసన్నపేటలోని రెడ్డికవీధి. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు అచ్యుతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న దళిత జేఏసీ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని దళిత జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో గురువారం నిర్వహించిన సమావేశంలో వీరు మాట్లాడారు. రాష్ట్రం యూనిట్‌గా అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. డిగ్రీ విద్య ప్రవేశ పెట్టాలని, ఉపాధి కోర్సులు, పారామెడికల్ కోర్సులు ప్రారంభించాలని, భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు పోస్టులు నియామకాలు చేపట్టాలని, విద్య బలోపేతం చేయాలని, సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు దెబారిక రాము, బొడ్డేపల్లి భూపతిరావు, పడాల ప్రతాప్, దుర్గాసి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి హిమబిందు ఎంపిక



జాతీయ స్కాలర్ షిప్‌కు ఎంపికైన హిమబిందుతో గురువు శ్రీకాంత్

శ్రీకాకుళం కల్చరల్: కూచిపూడి నాట్యంలో కేంద్ర ప్రభుత్వం సీసీఆర్టీ ఆధ్వర్యంలో యువ కళాకారులకు ఇచ్చే ఉపకార వేతనానికి పట్టణానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ శ్రీకాంత్ శిష్యురాలు హిమబిందు ఎంపికైంది. ఈ మేరకు శ్రీకాంత్ మాట్లాడుతూ జాతీయ స్కాలర్‌షిప్‌కు తమ శిష్యురాలు ఎంపిక కావడం ఆనందంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కరికే అవకాశం లభించిందని, అది తమ శిష్యురాలైన హిమబిందుకు దక్కిందని అన్నారు. ఈ సందర్భంగా హిమబిందుకు పలు కళాసంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జై చిరంజీవా.. జగదేకవీరా..

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గారెలు, అప్పాలు వంటి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు.

–సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నకొంగరాంలో బైక్ ర్యాలీ



గార: జొన్నలపాడు కాలనీలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



గార: తండ్యాలపేటలో ఆంజనేయ గుడి వద్ద అన్నదానం



ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: కోలాటం చేస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: హరేకృష్ణ బృందం భజనలు



శ్రీకాకుళం కల్చరల్: పుణ్యపువీధిలో అభయాంజనేయుని ఊరేగింపు



శ్రీకాకుళం కల్చరల్: దమ్మలవీధిలో సామూహిక పారాయణలు



శ్రీకాకుళం కల్చరల్:ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో సామూహిక సుందరకాండ పారాయణ



శ్రీకాకుళం రూరల్: పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి



రణస్థలం: సూరంపేటలో ఆంజనేయస్వామికి పూజిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: బలగ హరేరామమందిరంలో హనుమాన్ చాలీసా పారాయణ



శ్రీకాకుళం కల్చరల్:బలగ బాలాత్రిపుర కాలబైరవ పీఠంలో పూజలు



శ్రీకాకుళం కల్చరల్:విశాఖ-బీ కాలనీ షిరిడిసాయి మందిరంలో హనుమత్ జయంతి



శ్రీకాకుళం కల్చరల్: కోదండరామాలయంలో ఆంజనేయునికి పూజలు